క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాలను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముదిరాజ్‌లు అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు.ఈ ఉత్సవాలకు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పరమేశ్, మోహన్, రాంచంద్రం, ఆనందం, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆహ్వానం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటాపూర్(కె) గ్రామంలో ముదిరాజ్ కుల దైవం పెద్దమ్మ పంచమ వార్షిక మహోత్సవానికి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పెద్దమ్మ కల్యాణానికి హాజరు కావాలని ముదిరాజ్ కులస్తులు పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లా వెంకట్, కాషాబోయిన దయాకర్, చెన్నమైన వెంకటయ్య గాండ్ల రాజు, కాస నర్సింలు, జనగామ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



విద్యార్థులకు అంబలిని అందజేస్తున్న డీఈఓ రాధాకిషన్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వేసవి కాలంలో చల్లదనాన్ని పంచే అంబలిని విద్యార్థులకు అందించడం అభినందనీయమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మండల పరిధిలోని నాగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పది సంవత్సరాలుగా ఉపాధ్యాయులు కిషన్ సాకారంతో అందజేస్తున్న అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలకంఠం, సుదర్శన మూర్తి, ఉపాధ్యాయులు కృష్ణ, మధు మోహన్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సుభాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ



కిషన్‌రెడ్డితో విజయ్ కుమార్

నిజాంపేట(మెదక్): జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సంఘటన మంత్రి చంద్ర శేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని రఘునందన్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు.

ఆరుబయటే ఈఎస్‌ఐ సేవలు



ఆరుబయటే పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తూప్రాన్: ఈఎస్‌ఐ వైద్య సేవలు రెండో రోజు ఆరుబయటే కొనసాగాయి. వైద్యం కోసం వచ్చిన కార్మికులకు డిస్పెన్సరీ వైద్యులు ఆరుబయటే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు లేకుండానే రోగులను పంపించారు. ఆసుపత్రి నిర్వహణ కోసం అద్దెకు ఇచ్చిన ఇంటి యజమాని ప్రతాప్‌రెడ్డికి గత ఏడాదిగా సుమారు రూ.2 లక్షల వరకు అద్దె డబ్బులు రావాల్సి ఉందని సోమవారం డిస్పెన్సరీ(ఆస్పత్రి)కి తాళం వేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంను 'సాక్షి' డిస్పెన్సరీవె వైద్యులు సాయిభారత్‌ను వివరణ కోరగా.. అద్దె చెల్లించాల్సిన విషయం వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు చేయాలని కోరారు. సుమారు ఐదు వేల మంది వరకు కార్మికులు ఉన్నారని తెలిపారు. నిత్యం 40 నంచి 50 మంది వరకు ఓపీ ఉంటుందని చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.

నీటి కోసం మూగ జీవాల తండ్లాట

- నిర్వహణ లోపంతో నిరుపయోగంగా పశువుల నీటితొట్లు
- పట్టించుకోని అధికారులు



తాగునీటి కోసం చెరువు వద్దకు పశువులను తీసుకెళ్తున్న కాపరి

నర్సాపూర్ రూరల్: వేసవిలో మూగజీవాలు నీటి కోసం తండ్లాడుతున్నాయి. ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో జీవాల దాహార్తి తీర్చేందుకు గిరిజన తండాలు, గ్రామాల్లో నీటి తొట్లు నిర్మించింది. సంబంధిత అధికారులు వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో మూగజీవాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నిచోట్ల నీటి తొట్లు శిథిలావస్థకు చేరగా.. మరికొన్ని నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో పలుచోట్ల దెబ్బతిన్నాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు.

నర్సాపూర్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 50 వరకు గిరిజన తండాలు ఉన్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2019 వరకు గ్రామాల్లో, గిరిజన తండాల్లో మూగజీవాల సంఖ్యకు అనుగుణంగా సుమారు 70 వరకు నీటి తొట్లు నిర్మించారు. రెడ్డిపల్లి, నారాయణపూర్, పిల్లికుంట గుంట తండా, మూసాపేట, తదితర గ్రామాలలో తొట్లు ధ్వంసం కాగా కాగజ్ మద్దూర్, గూడెంగడ్డ, అవంచ, రామచంద్రపూర్, తదితర చోట్ల నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. రోజు రోజుకు ఎండ తీవ్రం దూర ప్రాంతాల్లోని చెరువుల వద్దకు పశుపోషకులు పశువులను తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నారు.



అహ్మద్ నగర్‌లో ధ్వంసమైన నీటి తొట్టి



కాగజ్ మద్దూర్‌లో పశువుల నీటితొట్టి

చెరువుల్లో నీరు తాగిస్తున్నాం



గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టిలు నిరుపయోగంగా మారాయి. దీంతో పశువులను దూరంలో ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. ఎండలు తీవ్రమైతే నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. నీటితొట్లను వినియోగంలోకి తేవాలి.

–బత్తుల లక్ష్మి, పశువుల కాపరి

పగుళ్లు తేలాయి



గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టి పగుళ్లు తేలడంతో నీరు నిల్వడంలేదు. నీటిని తాగేందుకు మూగ జీవాలు అవస్థలు పడుతున్నాయి. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తే పశుపోషకులకు మేలు జరుగుతుంది.

– దయాకర్, పశుపోషకుడు, రెడ్డిపల్లి

చర్యలు తీసుకుంటాం



గ్రామాలు, గిరిజన తండాల్లోని పశువుల నీటితొట్లను పరిశీలించి నీటిని నింపించేందుకు చర్యలు తీసుకుంటాం. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు గ్రామాల్లోని బోర్లలో నీరు అడుగంటి పోవడంతో తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయి.

– వైద్య శ్రీనివాస్, ఎంపీఓ నర్సాపూర్

గూడూర్‌లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు



మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లోని శిఖం భూమిలో మంగళవారం జేసీబీతో రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తున్నారు. కబరస్థాన్ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తుండడంతో ముస్లింలు వెళ్లి అడ్డుకున్నారు. అక్కడి నుంచి గ్రామ ఎర్ర చెరువు శిఖం భూమిలో తవ్వకాలు జరిపారు. ఇలా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాల వల్ల భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని గ్రామస్తులు ప్రశ్నించారు.

మెట్టురాములుశర్మ సేవలు అభినందనీయం

డీఈఓ రాధాకిషన్



రామలుశర్మను సన్మానిస్తున్న డీఈఓ రాధాకిషన్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు, పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేసిన హెచ్‌ఎం మెట్టురాములుశర్మ సేవలు అభినందనీయమని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. మంగళవారం మండలంలోని సదాశివపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మెట్టు రాములుశర్మ ఉద్యోగ విరమణ అభినందన సభకు డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో వేదపండితులు హరిశర్మ, డైట్ ప్రిన్సిపాల్ రమేశ్, జిల్లా నోడల్ అధికారి సుదర్శన మూర్తి, ఎంపీఓ బుచ్యానాయక్, పీఆర్‌డిప్యూటీఈఈ అమరేశ్వర్, ఏఈ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు నర్సింగరావు, వీరయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు యాదగిరి, శ్రీనివాసరావు, ఎశందర్ రెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



సూచనలు చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ దీపిక

నర్సాపూర్ రూరల్: ప్రతీ ఒక్కరు కొలతల ప్రకారం పనిచేయాలని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ దీపిక ఉపాధి కూలీలకు సూచించారు. మంగళవారం మండలంలోని నత్నాయ్యపల్లిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఉపాధి హామీ కూలి ప్రభుత్వం సూచించిన విధంగా కొలతల ప్రకారం పని చేస్తే గిట్టుబాటు కూలీ వస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు నిర్ణీత గడువులో కూలి డబ్బులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గున్నాల పోచన్న పాల్గొన్నారు.

రేపటి నుంచి దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని బేస్తగల్లిలో గురువారం నుంచి దుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో గురువారం గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, జలాధివాసం, శుక్రవారం కలశస్థాపన, శనివారం హోమం, యంత్ర ప్రతిష్ఠాపన, దుర్గమ్మ, నాగేంద్రుడు, కేశమ్మ, పాపమ్మ, ధ్వజస్తంభం, పూర్ణాహుతి, ఆదివారం అమ్మవారి ఊరేగింపు, బోనాలు, మంగళవారం ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించనున్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని మాచవరం శివారులో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు మెదక్ రూరల్ ఎస్‌ఐ అమర్ తెలిపారు. మెదక్ మండలం మాచవరంకు చెందిన నర్సింలు పోచయ్య, వెంకటేశం, కొల్చారం మండలం రాంపూర్‌కు చెందిన శ్రీశైలం, పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గాగౌడ్‌లు పేకాట ఆడుతుండగా పట్టుకొని వారి వద్ద నుంచి రూ.15వేల 311 నగదు, ఒక బైక్, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాట ఆడినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

సర్వాయిపాపన్న వర్ధంతి

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

మండల విద్యాధికారి బుచ్యానాయక్



ఉపాధ్యాయుడు శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న విద్యాధికారి బుచ్యానాయక్

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని నర్సాపూర్ మండల విద్యాధికారి బుచ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆదారపు శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సమావేశంలో ముఖ్య అతిథిగా బుచ్యానాయక్ హాజరై మాటాడారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి , సూర్యప్రకాశ్ రావు , పాఠశాల హెచ్‌ఎం నాజియా తబస్సుం, మాజీ సర్పంచ్ శివకుమార్, ఉపాధ్యాయులు శ్రీశైలం, బాలచంద్రం, మల్లేశం, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, వేంకటేశ్వరరావు, సురేశ్ కుమార్, అప్పలనాయుడు, కవిత పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాస్ – వరలక్ష్మి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అందరినీ అలరించాయి.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో రేణుకా ఎల్లమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకం, హోమం, కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశానుసారం ఏఎస్‌ఐ జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు హెడ్ కానిస్టేబుల్ వేణు గోపాల్, సునిత సిబ్బంది నరహరి, రజాక్, విజయ్, నవీన్, సోహెల్, అమని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామదేవతల ఉత్సవాలు



టేక్మాల్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ గ్రామంలో దుర్గమ్మ, పోచమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కొబ్బరి కాయ కుస్తీని మొదలుకొని వెండికడియం కుస్తీ వరకు కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. విజేతగా నిలిచిన కర్ణాటక రాష్ట్రం లాతూర్‌కు చెందిన అబిజిత్ అభినందించి 5 తులాల వెండికడియాన్ని బహూకరించారు. ఇందులో ఎస్‌ఐ మురళి, నాయకులు నిమ్మరమేశ్, చింత రవి, వీరప్ప, భాస్కర్, పాపయ్య, సిద్దయ్య, సాగర్, అనిల్, కిషోర్ తదితరులు ఉన్నారు.



ఎదగని వరి పంటను చూపుతున్న రైతులు

పంట ఎదగడం లేదు

శివ్వంపేట(నర్సాపూర్): నకిలీ విత్తనాలతో పంట ఎదగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సంఘటన మండల కేంద్రం శివ్వంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు రైతులు స్థానికంగా ఉన్న ఓ ఫర్టిలైజర్ దుకాణంలో కావ్సిన్ సీడ్స్ కంపెనీకి చెందిన భావన రకం వరి విత్తనాలు తీసుకున్నారు. పంట వేసి 120 రోజులు అవుతున్నప్పటికీ ఎదగడం లేదని రైతులు వాపోయారు. శివ్వంపేటలో సుమారు 50 ఎకరాల వరకు వేసిన ఈ రకం వరి విత్తనంతో పంట ఎదగడం లేదని దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు శ్రీనివాస్, వెంకటేశ్, యాదగిరి, నర్సింలు, అర్జున్, తదితరులు అన్నారు. మంగళవారం పంటలు పరిశీలించేందుకు వచ్చిన సీడ్ కంపెనీ సూపర్‌వైజర్లు రావడంతో వారితో రైతులు వాగ్వాదానికి దిగారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసి నష్టపోయామన్నారు. నకిలీ విత్తనాలతో ఎదగని పంటకు పరిహారం ఇవ్వాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉద్యమకారులకు బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లేదు

నర్సాపూర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లేనందున వారు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. నియోజకవర్గంలోని హత్నూర మండలానికి చెందిన పలువురు తెలంగాణ సాధన ఉద్యమకారులు మంగళవారం ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల సమితి హత్నూర మండల ఉపాధ్యక్షుడు మారుతిరాజు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

◆ దొంతిలో అక్రమంగా ఇసుక ఫిల్టర్ ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామ చెరువు వద్ద అక్రమంగా మంగళవారం ఇసుక ఫిల్టర్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పలువులు వ్యక్తులు కుందలమ్మ చెరువులో మోటార్ పెట్టి నీటి తోడుతూ అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక ఫిల్టర్ ఏర్పాటు చేశారు. ఈ విషయం పలువురు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో నుంచి మోటార్ తొలగించి ఇసుక ఫిల్టర్ పనులను అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

◆ కాళ్లకల్ చెక్ పోస్టు వద్ద నగదు పట్టివేత

మనోహరాబాద్(తూప్రాన్): సరైన పత్రాలు లేకుండా నగదుతో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద నుంచి రూ.70 వేల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిరిసిల్లా జిల్లా, చందుర్తి మండలం వంగాల గ్రామానికి చెందిన ఎం. నరేష్ డబ్బుతో ప్రయాణిస్తుండగా.. కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. దీంతో పోలీసులకు లభించిన డబ్బుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి సిద్దిపేట ఎన్నికల అధికారి కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

◆ సన్మానం



నర్సాపూర్ రూరల్: మండలంలోని ఆవంచలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ బాబ్యానాయక్, వైస్ మున్సిపల్ చైర్మన్ నయీంముద్దీన్, మాజీ సర్పంచ్‌లు ఉమ్లా నాయక్, కరుణాకర్, నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

◆ అక్రమంగా తరలిస్తున్న కల్లు ఆటో పట్టివేత

తూప్రాన్: అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆటోలో తరలిస్తున్న 900 సీసాల కల్లును పట్టుకున్నట్లు ఎస్‌ఐ శివానందం మంగళవారం తెలిపారు. పట్టణంలోని నాగులపల్లి చౌరస్తా వద్ద ఆటోలో 80 పెట్టెల్లో సుమారు 900 కల్లు సీసాలను పట్టణ సమీపంలోని తాతపాపన్‌పల్లికి తరలిస్తుండగా పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

తూప్రాన్: మెదక్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ కబేళా కాంట్రాక్టర్ తొలగింపు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో అధిక రుసుం వసూలు చేస్తున్నడన్న ఆరోపణలపై కబేళ కాంట్రాక్టర్‌ను తొలగించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఏడుపాయల్లో మూగజీవాల వధ కోసం నిర్ణయించిన ధరల కన్నా కాంట్రాక్టర్ ఎక్కువ రుసుం వసూలు చేస్తున్నాడని నాగస్సాన్‌పల్లి గ్రామస్తులు, భక్తులు ఈఓ మోహన్‌రెడ్డికి, చైర్మన్ బాలాగౌడ్‌లకు ఫిర్యాదు చేశారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై కాంట్రాక్టర్ పోలీస్‌కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అతన్ని వెంటనే తొలగించాలని మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో తాత్కాలికంగా కబేళ నిర్వహణ బాధ్యతల నుంచి అతనిని తప్పించి, ఆలయ ఉద్యోగులకు అప్పజేప్పుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ కేశవులు, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గోవింద్ నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దుర్గారెడ్డి, నర్సింలు, దుర్గేష్, నర్సింలుగౌడ్, భరత్‌గౌడ్, శ్రీకాంతప్ప, శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

చేగుంట(తూప్రాన్): ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విద్యార్థులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రం చేగుంటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనికేతన్, కళాశాల సిబ్బంది బాబు, దీపిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నాయకుల కారు తనిఖీ

నర్సాపూర్: కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ తాత్కాలిక అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌ల కారును మంగళవారం చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈ అర్వింద్, పోలీసు సిబ్బంది కిషన్, సురేశ్‌నాయక్, ప్రవీణ్ తదితరులు విధులు నిర్వహిస్తున్నారు.

◆ పశువులకు టీకాలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రజాక్ పల్లి, ఖాసీంపూర్ గ్రామాల్లో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా పశువులకు టీకాలు వేశామని వెటర్నరీ డాక్టర్ సుధాకర్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది అలీ, కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ అడవిపంది దాడిలో వ్యక్తికి గాయాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అడవిపంది దాడిలో వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దబ్బెడ రాములు మేకలు మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లగా, పక్కనే పొదల్లో ఉన్న అడవిపంది అతనిపై దాడి చేసింది.

◆ పరామర్శ

నర్సాపూర్: మున్సిపాలిటీలోని 15వార్డు కౌన్సిలర్ లలిత అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చారు. దీంతో ఆమెను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. ఆమె వెంట జెడ్పీటీసీ బబియానాయక్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

◆ బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

మనోహరాబాద్(తూప్రాన్): పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం ఖాయయని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గజ్వేల్ నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. వీరిలో నాయకులు పురం రవి, వెంకట్‌గౌడ్, నాగభూషణం, భిక్షపతి, పాండుగౌడ్, ఉదయ్‌రంజన్‌గౌడ్, బాలకృష్ణ, నాగరాజు తదితరులున్నారు.